సాక్షి
జనగామ

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు

భవిష్యత్‌లో క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించి అమలు చేయనున్నట్లు కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి తెలిపారు. - 8లో▸



అపరాల సాగును విస్తరించాలి

అపరాల పంటలసాగును విస్తరించాల్సిన అవసరముందని కాన్పూర్ వానాకాలపు అపరాల పంటల సాగు కోఆర్డినేటర్ ఆదిత్య ప్రతాప్ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

33⁰ /22⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ : ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంతోపాటు సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 29న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 9959226047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని కోరారు.

'డబుల్' ఇళ్లను లాక్కోవడం సరికాదు



జనగామ రూరల్: గత ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన డబుల్ ఇళ్లను గుంజుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి మాట్లాడారు. తొర్రూరు డబుల్ బెడ్ రూం ఇళ్ల బాధితులకు అండగా ఉండాల్సింది పోయి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. నిరుపేదలకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో తొర్రూరు(జే) డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాజీమార్గంలోనే సమస్యల పరిష్కారం



జనగామ రూరల్:రాజీమార్గంలోనే కక్షిదారుల సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, ప్రమాదం, విద్యుత్, ఫ్యామిలీ తదితర కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. మొత్తం 2,977 కేసులు పరిష్కారం అయ్యాయని, ఆయా కేసుల ద్వారా రూ. 1,58,01,568 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అడ్వకేట్ చంద్రశేఖర్, సుచరిత, రేఖ, కవిత, చంద్రరుషి పాల్గొన్నారు.

50 పోస్టులకు 1,057 దరఖాస్తులు

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలలో 13 కేటగిరీల్లో ఖాళీగా ఉన్న 50 పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ వేయగా, శనివారం చివరి రోజు వరకు 1,057 దరఖాస్తులు వచ్చినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు తెలిపారు. ల్యాబ్ అటెండెంట్ 177, రేడియోగ్రఫీ టెక్నీషియన్లు 18, సిటీ టెక్నీషియన్ 5, ఈసీజీ టెక్నీషియన్ 10, అనస్తిషియా 20, దోబీ 26, ప్లంబర్ 5, ఎలక్ట్రిషియన్ 77, డాటా ఎంట్రీ ఆపరేటర్ 422, డ్రైవర్ 38, థియేటర్ అసిస్టెంట్ 46, గ్యాస్ ఆపరేటర్ 11, వార్డు బాయ్ 202 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

శైవాగమశాస్త్రం సర్వజనహితం

పాలకుర్తి టౌన్: శైవాగమ శాస్త్రం సర్వజనహితమని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ముఖ్య అర్చకుడు దేవగిరి అనిల్ శర్మ అన్నారు. శనివారం పాలకుర్తిలో తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ పండిత పరిషత్ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ శర్మ మాట్లాడుతూ శైవాగమ శాస్త్రం సర్వమానవాళి జీవనశైలికి మార్గదర్శనమన్నారు. ఈ సదస్సులో తిరుపతి తిరుమల దేవస్థానం శైవాగమ పండితులు పరమేశ్వర శివాచార్య, శివకిరణ్, రవి, దేవగిరి సునీల్‌శర్మ, సంతోష్‌శర్మ, శ్యాం శర్మ పండితులు పాల్గొన్నారు. అనంతరం సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రదోషకాల సమయంలో వేదమంత్రోచ్చారణ నిర్వహించారు.

యువకులపై పోక్సో కేసు

జనగామ: జనగామకు చెందిన ఐదుగురు యువకులపై హైదరాబాద్ సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు కాగా, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాకు చెందిన ఓ బాలికతోపాటు మరో రాష్ట్రానికి చెందిన బాలిక ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు శనివారం జనగామకు వచ్చారు. ఐదుగురి యువకుల జాడ కోసం గాలించగా ముగ్గురిని పట్టుకుని పట్టణ పీఎస్‌కు తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మరో ఇద్దరు యువకులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై ముగ్గురు యువకులను సైదాబాద్ పోలీసులు పట్టుకెళ్లినట్లు ఎస్సై చెన్నకేశవులు తెలిపారు.

ఈనెల 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌కు చెందిన మంథని రాజేందర్(37) గుండెపోటుతో మృతి చెందాడు. నాయీబ్రాహ్మణ వృత్తిపై జీవనం గడుపుతున్న యువకుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేకపోయినా గుండె పోటు వచ్చింది.

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లికి చెందిన యువ రైతు జనగం ఈశ్వర్(45) ఈనెల 11న గుండెపోటుతో మరణించాడు.

ఆగస్టు 19న వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన నాలుగో తరగతి విద్యార్థి పూదోట అక్షిత్(10) గుండెపోటుతో మృతి చెందాడు.

ఆగస్టు 13న వరిపొలానికి మందు పిచికారీ చేస్తూ జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన పట్టుపాక మహేందర్(32) గుండెపోటుతో మృతి చెందాడు.

ఈనెల 14న మానుకోట జిల్లా పెద్ద వంగర మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోధుమల రవికుమార్ (54) గుండె పోటుతో మరణించాడు.

హృదయం పదిలమేనా?

- పెరుగుతున్న హృద్రోగుల సంఖ్య
- మారిన జీవన శైలే కారణం
- కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి
- ప్రభుత్వపరంగా గుండె వ్యాధిగ్రస్తులకు ఓరుగల్లులో మెరుగైన చికిత్స
- వైద్యులను పెంచాలని వేడుకుంటున్న రోగులు

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం


ఎంజీఎం:

గతంలో గుండె జబ్బు వచ్చిందంటే వయసు పైబడిందని భావించేవారు. ప్రస్తుతం వయసుతో నిమిత్తం లేకుండా పిల్లలు, యువకులు, వృద్ధులు అందరూ గుండె జబ్బులతో బాధపడుతున్నారు. ఇందుకు మారిన జీవన శైలే కారణమని గుండె వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, పొగతాగడం, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి తదితర కారణాలతో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవడంతో పాటు లక్షణాలు తెలుసుకుని జాగ్రత్త పడితే గుండె పోటు మరణాలు తగ్గించవచ్చని సూచిస్తున్నారు. నేడు (ఆదివారం) ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

భోజనంలో ఉప్పు తగ్గించాలి. చెడు అలవాట్లకు, కేలరీలు ఎక్కుగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలి. మాంసాహారం తగ్గించి కోడిగుడ్డు, చేప వంటివి తినాలి. నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. తాజా ఆహారం, ఆకుకూరలు తీసుకోవాలి. తప్పకుండా వ్యాయామం చేయాలి. వారానికి కనీసం ఐదు రోజుల పాటు చెమటలు వచ్చేలా కనీ సం 30 నిమిషాల పాటు వాకింగ్ చేయాలి. మోకాళ్ల నొప్పులు ఉన్న వారు యోగా చేస్తే మంచిది.

ముందస్తు లక్షణాలు..



చాలా మందికి గుండె పోటుకు ముందు ఛాతిలో నొప్పిగా అనిపిస్తుంది. దీన్ని గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయవద్దు. ఎడమ చేతినొప్పి, దడ, ఆయాసం, చెమటలు పట్టడం వంటి లక్షణాలను తేలికగా తీసేయొద్దు. చెడు కొలస్ట్రాల్, బీపీ, షుగర్ ఉన్న వారికి అకస్మాత్తుగా గుండె నాళాలు మూసుకుపోతాయి. గుండెకు రక్తం సరఫరా నిలిచి గుండెపోటుకు దారి తీస్తుంది.

పిల్లలకూ తప్పని ముప్పు..

గర్భిణులుగా ఉన్న సమయంలో యాంటీబయాటిక్స్ మందులు ఎక్కువగా వాడడం.. సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో శిశువుల్లో గుండె సంబంధ వ్యాధులు పుట్టుకతోనే వస్తున్నాయని వైద్యులు భావిస్తున్నారు. మేనరికం వివాహాల వల్ల కూడా గుండె జబ్బులు వస్తున్నట్లు గుర్తించారు.

గుండెజబ్బుల విభాగానికి పెరిగిన తాకిడి


ఎంజీఎం ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి గుండెజబ్బుల విభాగానికి రోగుల తాకిడి పెరుగుతోంది. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు 32,381 మందికి గుండె రోగులకు వైద్యం అందించారు. ఈఏడాది సెప్టెంబర్ వరకే 25,437 మందికి ఓపీ విభాగం ద్వారా చికిత్స అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి నెలకు సుమారు మూడు వేల మంది వచ్చి చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈసంఖ్య నెలకు 5 వేల నుంచి 10 వేల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లిలో 49, వరంగల్‌లో 509 మంది, జనగామలో 5,885, మానుకోటలో 60వేల మంది గుండె వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్న వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



ఎంజీఎం ఆస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్

సూపర్ ఆస్పత్రిలో పేదలకు మెరుగైన చికిత్స

కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో క్యాథ్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పేద ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లకుండా.. ప్రైవేట్ ఆస్పత్రిలో లక్షలాది రూపాయలు ఖర్చు చేయకుండా.. ఈసీజీ, టూడీ ఎకో, అంజియో స్టంట్లు వంటి చికిత్సలు అందిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. ఓపీ విభాగానికి రోజుకు 300 మందికి పైగా రోగులు వస్తున్నారు. ఇద్దరు కార్డియాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉండడంతో రోగులకు చికిత్స అందించడం సాధ్యం కావడం లేదు. వైద్యులను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



అవగాహన కల్పిస్తున్నాం..



గత కొన్నేళ్లుగా ఫౌండేషన్ ద్వారా గుండె జబ్బు వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. సడెన్ కార్డియాక్ అరెస్ట్ జరిగినప్పుడు ఆ వ్యక్తిని ఎలా కాపాడాలనే అంశంపై వివరిస్తున్నాం.

– డాక్టర్ రామక శ్రీనివాస్, శ్రీనివాస్ హార్ట్ ఫౌండేషన్

కార్డియాలజీ వైద్యుల నియామకానికి చర్యలు



ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలపై ఎప్పటికప్పుడు అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. కార్డియాలజీ వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నూతన పరికరాల కొనుగోలుకు సైతం కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రతి రోగికి పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తున్నాం. పెరుగుతున్న రోగుల తాకిడికి అనుగుణంగా వైద్యుల సంఖ్య, నూతన పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తాం.

– మురళి, ఎంజీఎం సూపరింటెండెంట్

'రేబిస్' పై అవగాహన ఉండాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: రేబిస్ వ్యాధిపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుక్క కరిస్తే వెంటనే తీసుకోవాల్సిన చికిత్సపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల చుట్టూ ఉన్న కుక్కలు ఎలాంటి పరిస్థితిలో ఉన్నాయని గమనించాలని, దారి వెంట వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కువగా ఆహార పదార్థాలు పట్టుకుని వచ్చేటప్పుడు కుక్కలు వెంట పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్నీ పశు వైద్యశాలలో రేబిస్ వ్యాధి టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య అధికారి రాధాకిషన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పావని,వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థి దశ చాలా కీలకమైందని, మంచి భవిష్యత్ ఉండాలంటే ప్రతీ విద్యార్థి చదువుపైన దృష్టి సారించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించి మాట్లాడారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రాధాన్యం

- డీఈఓ రాము

లింగాలఘణపురం: క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, విద్యార్థులు ప్రతీ రోజు ఒక పీరియడ్ తప్పనిసరిగా ఆటలు ఆడుకోవాలని డీఈఓ రాము సూచించారు. శనివారం మండల కేంద్రంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికను చేపట్టారు. ఈ సందర్భంగా డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎంఈఓ విష్ణుమూర్తి మాట్లాడుతూ మండలంలోని అన్నీ ఉన్నత పాఠశాలల నుంచి 310 మంది విద్యార్థులు హాజరయ్యారని, వీరిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్ హెడ్మాస్టర్లు మల్లికార్జున్, శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు కిష్టయ్య, అశోక్, గోర్‌సింగ్, ఇంద్రసేనారెడ్డి, శరత్, సంజీవ, సుశీల, సుధారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ

క్రీడల్లోనూ రాణించాలి

బచ్చన్నపేట: ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి ముగింపు క్రీడల సమావేశానికి ఆయన హాజరై బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బి. వెంకట్‌రెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సృజనాత్మకత అవసరం

- ఎన్‌ఆర్‌ఐ రాజనరేందర్‌రెడ్డి

జనగామ: ప్రతీ విద్యార్థి చదువుతో పాటు ఆటలు, సృజనాత్మకతలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎన్‌ఆర్‌ఐ, ప్రముఖ గుండె వైద్య నిపుణుడు, పాఠశాల పూర్వ విద్యార్థి చొల్లేటి రాజనరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కృష్ణమూర్తి అధ్యక్షతన 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులకు చొల్లేటి యశోదరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50వేల నగదు పురస్కారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్నామని, 2024–25లో 10 జీపీ సాధించిన ప్రతీఒక్కరికి నగదు అందిస్తామన్నారు. 27 వార్డు కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డాక్టర్ రాజనరేందర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, కనకయ్య తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో రాజనరేందర్‌రెడ్డి, తదితరులు

ఉద్యోగానికి రూ.2.50లక్షలు

- రూ.40వేలు అడ్వాన్స్, విధుల్లో చేరిన తర్వాత రూ.2.10 లక్షలు
- ఎన్‌హెచ్‌ఎం పోస్టులపై మాయగాళ్ల ఉచ్చులో అభ్యర్థులు
- డీసీపీకి ఫిర్యాదు చేసిన డీఎంహెచ్‌ఓ
- డబ్బుల కోసం అభ్యర్థులకు ఫోన్లు



జనగామ: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.. మెరిట్, అర్హత జాబితాలో మీ పేరు ఉంది.. అడ్వాన్స్‌గా గూగుల్ పేలో డబ్బులు పంపించండి.. లేదంటే లిస్టు నుంచి తొలగిస్తామంటూ వైద్యారోగ్య శాఖ ఉద్యోగినంటూ రామకృష్ణ అనే వ్యక్తి మాయ మాటలతో అభ్యర్థులను బురిడీ కొట్టిస్తున్న సంఘటన జిల్లాలో వెలుగు చూసింది. అభ్యర్థుల ఫిర్యాదు మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేశారు.

జిల్లా వైద్యారోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం స్కీంలో ఇటీవల 32 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. ఈ నెల 27న ఫైనల్ జాబితాను ప్రకటించారు. దీనిపై దుమారం రేగడంతో తప్పు, ఒప్పుల పరిశీలనకు ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. తప్పుల తడకగా మెరిట్ జాబితా చేశారని ఓ వైపు ఆరోపణలు వెల్లువెత్తుతుంటే.. మరో వైపు నకిలీ అధికారుల పేరిట ఫోన్లు చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. తేజస్విని అనే మహిళా అభ్యర్థి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా.. రామకృష్ణ అనే వ్యక్తి (8276841595) ఫోన్ చేశారు. సీనియర్ ఉన్నతాధికారులు మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తనతో సీక్రెట్‌గా చెప్పారు.. నెలకు రూ.35వేల వేతనం ...జాబితాలో వచ్చిన పేరు తొలగించొద్దంటే త్వరగా రూ. 40వేలు గూగుల్ పే (7003386564) పుట్ట లింగస్వామి పేరిట పంపించాలని కార్పొరేట్ స్థాయిలో నమ్మించే ప్రయత్నం చేశారు. డబ్బుల కోసం తేజస్విని కుటుంబ సభ్యులకు తెలుపగా, అనుమానం వచ్చిన వారు డీఎంహెచ్‌ఓను సంప్రదించారు. అప్పటికే నర్సంపేట, జనగామ, తదితర ప్రాంతాలకు చెందిన ఐదుగురు రూ.20 నుంచి రూ. 40వేల వరకు గూగుల్‌పే ద్వారా పంపించి, ఆర్డర్ కాపీ కోసం జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి వచ్చారు. ఇదే సమయంలో తేజస్విని అక్కడే ఉండడం... రామకృష్ణ అనే వ్యక్తి ఫేక్ అని తేలడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసి వెళ్లారు. గతంలో కూడా ఇదే తరహాలో మోసం జరిగినా... నిరుద్యోగంతో విసిగి వేసారిన యువతీ, యువకులు జాబ్ వస్తుందనే ఆశతో కేటుగాళ్ల ఉచ్చులో చిక్కుకుని పెద్ద ఎత్తున డబ్బులను పోగొట్టుకుంటున్నారు.

ఎవరూ నమ్మొద్దు..



అర్హత, మెరిట్ ప్రకారమే ఉద్యోగాలు వస్తాయి. వైద్యారోగ్య శాఖలో ఉద్యోగినంటూ డబ్బులు డిమాండ్ చేసి, పంపించాలని చెప్పే వారి మాటలను నమ్మొద్దు. మోసపోయిన పలువురు అభ్యర్థుల ఫిర్యాదు మేరకు, డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు లిఖిత పూర్వకంగా రాసిచ్చాం. కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశాం. ఎన్‌హెచ్‌ఎం పోస్టుల్లో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదు.

– డాక్టర్ రవీందర్ గౌడ్, డీఎంహెచ్‌ఓ

జిల్లాలో 4,09,797 ఓటర్లు

- తుది జాబితా విడుదల చేసిన డీపీఓ స్వరూప

జనగామ: గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని చేపట్టిన డ్రైవ్‌లో భాగంగా శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూప తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటర్లను మండలాలు, వార్డుల వారీగా విభజించి తుది ఓటరు జాబితాను తయారు చేశారు. జిల్లాలోని 283 గ్రామ పంచాయతీల పరిధిలో 4,09,797 ఓట్లు ఉండగా, ఇందులో పురుషులు 2,03,097, మహిళలు 2,06,696, ఇతరులు 4 ఉన్నారు. జిల్లాలోని ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ, తహసీల్దార్, కలెక్టరేట్ తదితర ముఖ్యమైన కార్యాలయాల్లో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. కాగా బచ్చన్నపేట మండలంలో 38,241, చిల్పూరు 32,512, దేవరుప్పుల 36,477, స్టేషన్‌ఘన్‌పూర్ 43,945, జనగామ 33,147, కొడకండ్ల 28,342, లింగాలఘణపురం 32,520, నర్మెట 20,106, పాలకుర్తి 51,680, రఘునాథపల్లి 43,887, తరిగొప్పుల 15,608, జఫర్‌గఢ్ 33,332 మంది ఓటర్లు ఉన్నారు.



తుది ఓటరు జాబితాను విడుదల చేస్తున్న డీపీఓ

'చెరువులు నింపకుండా మళ్లిస్తే ఊరుకోం'

జనగామ: తపాస్‌పల్లి రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని పంపింగ్ చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆలేరు ప్రాంతంలోని చెరువులను నింపేందుకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అక్కడి నుంచి మెయిన్ కాల్వల వద్ద నీటిని మళ్లించేందుకు కార్యకర్తలతో గేట్ వాల్వ్ విప్పించడం సరికాదన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపేయాలి

జనగామ రూరల్: అశాస్త్రీయంగా ఉన్న ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు తక్షణమే నిలిపేయాలని కోరుతూ శనివారం యూఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ జీఓ 25ను సవరించాలని, ప్రాథమిక స్థాయిలో ప్రతీ తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డి.శ్రీనివాస్, లక్ష్మయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

JANGAON INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES

(M.Pharmacy & B.Pharmacy)

Sponsored by: The Professional Educational Society

YESHWANTHAPUR, JANGAON. Cell: 9849084556

Approved by AICTE & PCI, Affiliated to Kakatiya University, Warangal

NOTIFICATION FOR B-CATEGORY

1. Eligible candidates for admission into 1st year M.Pharmacy & B.Pharmacy and who have not taken admission anywhere so for and qualified in G. Pat / PGECET - 2024 and having not less than 50% in B.Pharmacy.
2. The vacant seats, if any, may be filled with eligible candidates in the qualifying examination duly ensuring merit and transparency.
3. The last date to attend for B.Pharmacy, M.Pharmacy Management Admissions is 06-10-2024.

Name of the Course	B-Category
B. Pharmacy	30 Seats
M. Pharmacy (Pharmaceutics)	4 Seats
M. Pharmacy (Industrial Pharmacy)	4 Seats
M. Pharmacy (Pharmaceutical Analysis)	2 Seats

Sd- Secretary / Correspondent

పోలీస్ అమరుల భూములను పరిరక్షించాలి


డీజీపీతో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు

వరంగల్ క్రైం: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను పరిరక్షించాలని పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు శనివారం రాష్ట్ర డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ ఐజీకి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీస్ శాఖలో పనిచేసి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 14 మంది పోలీస్ అమరవీరుల కుటుంబాలకు కాజీపేట మండలంలోని సర్వేనంబర్ 27లో ఒక్కొక్కరికి 200 గజాలు భూమికి సంబంధించిన పట్టాలు అందజేశారన్నారు. ఆ స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆ భూమి ఎఫ్‌టీఎల్‌లో ఉందని నోటీసులు ఇవ్వడంతో పోలీస్ అమరవీరుల కుటుంబాల సభ్యులు ఆందోళన చెంది డీజీపీని కలిశారు. దీంతో డీజీపీ జితేందర్.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. డీజీపీని కలిసిన వారిలో పోలీస్ అమరవీరుల కుటుంబాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం రేణుక, ఉపాధ్యక్షురాలు స్వరూపరాణి, తదితరులు ఉన్నారు.

రుణం రెన్యూవల్ కోసం వచ్చి..

- బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి


నర్సమ్మ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : బంగారంపై తీసుకున్న రుణాన్ని రెన్యూవల్ చేసేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు ద్విచక్ర వాహనం ఢీకొని శనివారం మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామానికి చెందిన ముద్దంగుల నర్సమ్మ (70) మానుకోటలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టిన బంగారం రుణాన్ని రెన్యూవల్ చేసుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో ఆధార్ కార్డు జిరాక్స్ కోసం వచ్చి రోడ్డు దాటుతుండగా, వివేకానంద సెంటర్ వైపు నుంచి నర్సంపేట రోడ్డు వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టగా తలకు తీవ్రగాయమై రోడ్డుపై పడిపోయింది. స్థానికులు డయల్-100కు సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే నర్సమ్మ మృతిచెందిందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.



'డీఈఈ'సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విద్యారణ్యపురి: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లో 2024-2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను డీఈఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించి ఇప్పటివరకు ధ్రువపత్రాల వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు అక్టోబర్ 1న హనుమకొండలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో తమ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె. నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, ఎస్ఎస్‌సీ, ఇంటర్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ సర్టిఫికెట్, టీసీతోపాటు 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీసర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్‌సీ సర్టిఫికెట్లు కూడా తీసుకు రావొచ్చని తెలిపారు.



క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు

- 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి
- అట్టహాసంగా అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలు ప్రారంభం


బ్యాటింగ్ చేస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : భవిష్యత్‌లో క్రికెట్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లా కేంద్రంగా అక్టోబర్ 5వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీలను వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో క్రికెట్‌పై జిల్లాలదే ఆధిపత్యం కానుందన్నారు. క్రికెట్ క్రీడాకారుడిగా క్రీడాకారుల అభ్యున్నతి, వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఖాజా, కార్యవర్గ సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, సంఘం మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు, బాధ్యులు బండారి ప్రభాకర్, రామకృష్ణ, గ్రౌండ్ ఇన్‌చార్జ్ మంచిక అభినవ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లి, మొగిలిచర్ల మైదానాల్లో మ్యాచ్‌లు..

మొదటి రోజు వరంగల్ నగర శివారులోని కోమటిపల్లి, మొగిలిచర్ల మైదానాల్లో రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొగిలిచర్ల మైదానంలో వరంగల్, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లు ఆడి అన్ని వికెట్లు కోల్పోయి 121 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన ఆతిథ్య వరంగల్ జట్టు 29.4 ఓవర్లలో కేవలం 87 పరుగులు మాత్రమే చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. మహబూబ్‌నగర్ చేతిలో 34 పరుగుల తేడాతో వరంగల్ ఓటమి చవిచూసింది. కోమటిపల్లి గ్రౌండ్‌లో మెదక్, నల్లగొండ జిల్లాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మెదక్ నిర్ణీత 43 ఓవర్లకు గానూ 21.2 ఓవర్లు మాత్రమే ఆడి కేవలం 53 పరుగుల వద్ద అన్నీ వికెట్లు కోల్పోయింది. అనంతరం బరిలోకి దిగిన నల్లగొండ 13.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 37 పరుగులతో విజయం సాధించింది. నేడు (రెండో రోజు) మొగిలిచర్ల మైదానంలో వరంగల్ వర్సెస్ మెదక్, కోమటిపల్లి మైదానంలో నల్లగొండ వర్సెస్ మహబూబ్‌నగర్ జట్లు తలపడనున్నాయని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


సీడ్‌బాల్స్‌ను పరిశీలించి ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణలో వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమని కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి అన్నారు. వరంగల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆడిటోరియంలో సీడ్‌బాల్స్ తయారు చేయించారు. ఈ మేరకు శనివారం రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వాసవీక్లబ్ సెక్రటరీ పల్లెర్ల వీరన్న ఇతరబాధ్యులు సీడ్‌బాల్స్‌ను పరిశీలించి ఆవిష్కరించారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో 20వేల సీడ్‌బాల్స్ తయారు చేయించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారు వరల్డ్ రికార్డులోభాగంగా వివిధ చోట్లతోపాటు కేయూలోనూ సీడ్‌బాల్స్ తయారు చేయించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. వాసవీ క్లబ్‌సెక్రటరీ వీరన్నకు విట్నెస్ స్టేట్‌మెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, అవెన్యూ ప్లాంటేషన్ ఇన్‌చార్జ్ పి. వెంకటయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, వాసవీ క్లబ్ వరంగల్ బాధ్యులు పుల్లూరు కిశోర్, గుంటూరు వెంకటనారాయణ, వల్లాల నాగేశ్వరరావు, టి. రామచంద్రం, జయప్రకాశ్, గుమ్మడవెల్లి సత్యనారాయణ, ఎం. సుధాకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగును విస్తరించాలి

- ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆదిత్య ప్రతాప్


అపరాల సాగును పరిశీలిస్తున్న ఆదిత్య ప్రతాప్

హన్మకొండ : అపరాల పంటసాగును గణనీయంగా విస్తరించాల్సిన అవసరముందని కాన్పూర్ వానాకాలపు అపరాల పంటల సాగు కోఆర్డినేటర్ ఆదిత్య ప్రతాప్ తెలిపారు. అఖిలభారత స్థాయిలో కంది పంట పరిశోధనలు పరిశీలించడంలో భాగంగా ఆయన శనివారం వరంగల్ పైడిపల్లిలోని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి విచ్చేశారు. పరిశోధన స్థానంలో చేపట్టిన అభివృద్ధిని అధ్యయనం చేశారు. శాస్త్రవేత్తలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అపరాల సాగు ఎలా ఉందో రైతులను అడిగి తెలుసుకున్నారు. అపరాల సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరాలకు మంచి డిమాండ్ ఉందని, ఆ మేరకు పంట ఉత్పత్తులు పెంచాలన్నారు. అధిక దిగుబడి వచ్చే పంట ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ వంగడాలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సంధ్య కిశోర్, మధు, వీరన్న, పద్మజ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం, తదితరులు పాల్గొన్నారు.


దంపతుల మధ్య గొడవ.. భర్త ఆత్మహత్య

కాశిబుగ్గ : దంపతుల మధ్య గొడవల కారణంగా మనస్తాపం చెందిన భర్త రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్ బీట్‌బజార్ పాత రైల్వే గేట్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ పి. సురేందర్ కథనం ప్రకారం.. నగరంలోని రామన్నపేటకు చెందిన వీరమల్లు రవికుమార్(44) 2007 సంవత్సరంలో రాధికను వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య తరుచూ గొడవ జరుగుతుండడంతో ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన వీరమల్లు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం భార్య రాధికకు అప్పగించామని సీఐ సురేదర్ తెలిపారు. కాగా, మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

కడుపు నొప్పి భరించలేక ఉరేసుకుని వ్యక్తి..


మడికొండ: కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాజీపేట మండలంలోని కొత్తపెల్లి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగపూరి కుమారస్వామి(57) కొద్ది రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నొప్పి భరించలేక శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి నర్సమ్మ చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వారు వచ్చి చూసి కొనఊపిరితో ఉండగా వెంటనే ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కుమ్మరికుంట్లలో మరోవ్యక్తి..


సుధాకర్(ఫైల్)

దంతాలపల్లి: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కుమ్మరికుంట్లలో జరిగింది. ఎస్సై పి. రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బైరి సుధాకర్(56) మరిపెడ పీహెచ్‌సీలో లోయర్ డివిజన్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పి. రాజు తెలిపారు.

'మావో'ల పేరుతో నగదు చోరీ


దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఝాన్సీ

చిన్నగూడూరు : మావోస్టులమంటూ అర్ధరాత్రి ఓ ఇంట్లో చొరబడి నగదు చోరీ చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు సూదగాని వెంకటయ్య ఒంటరిగా నివాసముంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వెంకటయ్యకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి చొరబడ్డారు. మావోస్టులమంటూ తుపాకీతో వెంకటయ్యను బెదిరించారు. అనంతరం బీరువాలో ఉన్న రూ.35 వేల నగదును చోరీ చేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.

దాతలు సాయంచేసి ఆదుకోండి

పుట్టుకతోనే రాని మాట, నడవలేని స్థితిలో ఏడేళ్ల చిన్నారి

- అప్పులు చేసి ఇబ్బందిపడుతున్న తల్లిదండ్రులు
- వైద్యసాయానికి దాతలు ఆదుకోవాలని వేడుకోలు


అచేతన స్థితిలో బాబు


ముగ్గురు పిల్లలతో తల్లి


దీన గాథ

కాశిబుగ్గ : తొలుసూరు కాన్పు కొడుకు పుట్టడంతో ఆ తల్లిదండ్రులు సంతోషంతో పొంగిపోయారు. కానీ ఆ సంతోషం కొద్దిరోజులకే ఆవిరైపోయింది.. అయితే పుట్టిన కుమారుడికి ఏడేళ్లు దాటినా మాటలు రావడంలేదు.. నడవలేడని తెలియడంతో వారు ఆవేదనకు గురయ్యారు. ఎలాగైనా తమ కుమారుడికి నాణ్యమైన చికిత్స అందించి నడక, మాటలు తెప్పించాలన్న ఆశతో ఉన్నంతలో వైద్యం చేయించారు. అందిన కాడ అప్పులు చేసి ఆధునిక వైద్యం చేయించారు. అప్పు చేసిన నగదు కూడా సరిపోకపోవడంతో ఏం చేయలో తోచక కొడుకుతో పాటు ఇంటి పట్టునే ఉండిపోయారు. దీంతో కన్నవారు దాతల సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ 26వ డివిజన్ లక్ష్మీపురంలోని పేద కుటుంబానికి చెందిన కట్కూరి ఆమల, శంకర్‌కు ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు. నివసించేందుకు సొంత ఇల్లు లేదు. తండ్రి రోజూ కూలీ పని చేస్తేనే కుటుంబం గడుస్తుంది. అలాంటి కుటుంబానికి పెద్ద కుమారుడు పుట్టుకతో నడవడం, మాట్లాడడం రాక మంచానికే పరిమితమయ్యాడు. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి ప్రయత్నించిన కొడుకు ఆరోగ్యం మెరుగుపడలేదు. అలాగే బాబుకు దివ్యాంగుల పింఛన్ కూడా అందడం లేదని పెన్షన్ అయిన ఇప్పించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన ఎలాంటి ఉపయోగం లేదు. కనీసం దాతలైన ఆదుకుని ఆర్థిక సాయం అందిస్తే తమ కుమారుడికి వైద్యం చేయిస్తామని నిరుపేద తల్లిదండ్రులు దాతలను వేడుకుంటున్నారు.

ఆర్థికసాయం అందించే దాతలు బ్యాంకు అకౌంట్ నంబర్: 62501684706, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0020903 కు చేయాలని కోరుతున్నారు. అలాగే గూగుల్ పే నంబర్: 73309 93682 (జీడీ క్రాంతి)

అటవీ సంపదను కాపాడుకోవాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


ధ్వంసమైన చెట్టును పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, తదితరులు

ఏటూరునాగారం/తాడ్వాయి: అటవీ సంపదను కాపాడుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి - మేడారం అటవీ మార్గంలో ఆగస్టు 30న భారీ పెనుగాలులకు కూలిన చెట్లను శనివారం నాయకులు, రిటైర్డ్ అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ప్రచండ పెనుగాలులు(టోర్నడోలు) వీచి సుమారు 15వందల ఎకరాల్లో చెట్లు నేల కూలాయన్నారు. రాష్ట్ర మంత్రులు సీతక్క, సురేఖ స్పందించి నేలకూలిన చెట్ల ప్రదేశాలకు ఎవరూ వెళ్లకుండా, ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక ప్రజలు, అటవీశాఖ అధికారులు ఈ కూలిన చెట్ల ప్రదేశాల్లో మళ్లీ మొక్కలు పెంచాలని కోరారు. గతంలో హరితహారం పేరుతో లక్షలాది మొక్కలు నాటామన్నారు. కానీ ఈ ప్రభుత్వం వాటిపై పెద్దగా దృష్టి సారించడం లేదన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బి.నాగజ్యోతి, నాయకులు రమణయ్య, సుధీర్, గోవింద్‌నాయక్, కుమారస్వామి, ప్రదీప్‌బాబు పుల్లయ్య, భాస్కర్, నర్సయ్య, యాదగిరి, ఖలీల్, చంద్రబాబు, భోజారావు, రమేశ్, మల్లయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆవుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- 13 పశువులు మృతి..పరారీలో డ్రైవర్


ప్రమాదంలో మృతి చెందిన ఆవులు

పాలకుర్తి టౌన్ : పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా పడడడంతో 13 గోవులు (ఆవులు) మృతిచెందిన సంఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సాయిప్రసన్న కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తొర్రూరు నుంచి జనగామ వైపునకు 51 లేగదూడలు, ఆవులు, పశువుల లోడుతో అతివేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం వావిలాల శివారు సబ్‌స్టేషన్ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 13 ఆవులు ప్రమాదస్థలిలోనే మృతి చెందాయి. కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడిన మరో 13 ఆవులకు పశువైద్యాధికారి చికిత్స చేసి ఆరోగ్యంగా ఉన్న 25 గోవులను పాలకుర్తిలోని గోశాలకు తరలించారు. మృతి చెందిన ఆవుల విలువ రూ.1.50 లక్షలు వరకు ఉంటుదన్నారు. డీసీఎం వాహనం బోల్తాపడడంతో అద్దాలు పగులగొట్టి అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు ఇద్దరు పరారయ్యారని తెలిపారు. బోల్తా పడిన డీసీఎంను పరిశీలించగా కర్ర చెక్కలు పేర్చి స్థాయికిమించి ఇరుకుగా పశువులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వావిలాల పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు, గ్రామస్తుల సహకారంతో గుంతతీసి మృతి చెందిన ఆవులను పూడ్చివేశారు. సంఘటన స్థలాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పరిశీలించారు.

ఐదేళ్ల చిన్నారి అపహరణ

- కాజీపేటలో బాలుడి కిడ్నాప్ కలకలం


మాట్లాడుతున్న అపహరణకు గురైన బాలుడి తల్లిదండ్రులు

కాజీపేట : ఐదేళ్ల చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన ఘటన కాజీపేట పట్టణంలో కలకలం రేపింది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఎస్‌కే మసూద్, కౌసర్ దంపతులు తమ కుమారులతో కలిసి జనగామకు వెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం కాజీపేటకు చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లి ఆరా తీయగా రద్దుతో ఎటువంటి రైళ్లు నడవడం లేదని తెలిసి రైల్వే ఇనిస్టిట్యూట్ ఎదుట కూర్చున్నారు. అదే సమయంలో దంపతుల మధ్య చిన్నపాటి గొడవ తలెత్తింది. దీంతో కౌసర్ అలిగి రెండున్నర ఏళ్ల వయసున్న కుమారుడిని తీసుకుని ప్రధాన రహదారి వైపు వెళ్లింది. అప్పటికే ముస్లిం దంపతులు వీరి పక్కన ఉన్నారు. అయితే మసూద్ తన వద్ద ఉన్న ఆయాన్‌ను (5)ఆ ముస్లిం దంపతులకు అప్పగించి భార్యను వెతికేందుకు రోడ్డుపై వచ్చాడు. అనంతరం భార్యను తీసుకుని ఆయాన్‌ను అప్పగించిన స్థలానికి రాగా, తమ కుమారుడు కనిపించలేదు. అయితే అక్కడే ఉన్న స్థానికులు గుర్తుతెలియని వ్యక్తులు బాలుడిని ఆటోలో తీసుకెళ్లినట్లుగా చెప్పారు. దీంతో తల్లిదండ్రులు రోదిస్తూ కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి తమ కుమారుడిని కిడ్నాపర్ల నుంచి కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

పుట్టిన సంతోషం లేకపాయె..

- వ్యాక్సిన్ వికటించి శిశువు మృతి!
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


శిశువు మృతదేహం

పరకాల : మగబిడ్డ పుట్టాడన్న సంతోషంతో ఉన్న ఆ..కుటుంబానికి రెండు రోజులకే విషాదం మిగిలింది. పుట్టిన శిశువుకు ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రి వైద్యుడు ఇచ్చిన వ్యాక్సిన్ వికటించి మృతిచెందిన సంఘటన పరకాలలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నడికూడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన బొజ్జ శైలజ గురువారం పరకాలలోని ఆయుష్ ఆస్పత్రిలో మగశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం ఆస్పత్రి వైద్యురాలి సూచన మేరకు పుట్టిన బాబుకు ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో వ్యాక్సిన్ వేయించారు. వ్యాక్సిన్ వేసినప్పటి నుంచి శిశువులో ఆరోగ్యపరమైన మార్పులు ఏర్పడి శనివారం మృతి చెందినట్లు శిశువు అమ్మమ్మ రమ బోరుమంటూ విలపించింది. కాగా, ఆస్పత్రి ఎదుట శిశువు మృతదేహంతో ఆందోళనకు దిగడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు. పుట్టిన శిశువుకు తల్లిపాలు ఇవ్వకపోవడం వల్ల ఊపిరితిత్తులలో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి చనిపోయినట్లు వ్యాక్సిన్ వేసిన వైద్యుడు పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ

- 3 క్వింటాళ్ల పత్తి దగ్ధం

లింగాలఘణపురం : మండలంలోని చీటూరులో అంబటి నాగిరెడ్డికి చెందిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలింది. దీంతో ఇంట్లోని మూడు క్వింటాళ్ల పత్తితో పాటు సమీపంలోని కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఏడాది క్రితం నాగిరెడ్డి రూ.1.20 లక్షలు చెల్లించి ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేయగా, రెండు నెలల తర్వాత బైక్ బ్యాటరీలో సమస్య తలెత్తింది. దీంతో సుమారు రూ.40వేలు చెల్లించి బ్యాటరీని మరమ్మతు చేయించారు. కాగా శనివారం ఉదయం బైక్‌ను చార్జింగ్ పెట్టి సమీపంలోనే వాకింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో నాగిరెడ్డి భార్య వెళ్లి చూడగా మంటలు వ్యాపించాయి. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే మూడు క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. అలాగే, సమీపంలోని కారు అద్దాలు మంట వేడికి ధ్వంసమయ్యాయి. బైక్ బ్యాటరీ పేలిన సమయంలో తాము అక్కడే ఉంటే తమ ప్రాణాలు పోయేవని నాగిరెడ్డి దంపతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు జరిగిన నష్టాన్ని బైక్ కంపెనీ వారు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్అడ్మిషన్స్:డిగ్రీ,PG, B.Tech., Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P. Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. ఫోన్ : 8866977112, 339 [HA-16400]

REAL ESTATE

ఫామ్ ల్యాండ్

■ నవరాత్రి ఇన్ఫ్రావారి వరంగల్- ఖమ్మం హైవే ఉప్పరపల్లి క్రాస్ దగ్గర కొత్తగా మొదలవుతున్న 30 ఎకరముల ఫామ్ ల్యాండ్ వెంచర్ నందు ఇన్వెస్ట్‌మెంట్ పార్టనర్స్ కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి. సెల్: +91 9392758621. [WA-7542]

COMMERCIAL RENT

■ Commercial space for Rent Ground & 1st Floor, with Parking 6128 x 2 Floors=12,256 sft. Hyder Manikanta Complex, Old Bus Depot Main Road, Near Thirumala Bar, Hanamkonda, Cont: 9542981472, 9440015246. [W-1239914]

FARM LAND FOR SALE

■ Farm Land for Marketing @ JP, Dargah. Total 6 Acre. Per Sq.Yd 6,500/-. Interested Companies Please Cont: +91 9646809999. [WA-7541]

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1237304]

PLOT FOR SALE

■ HNK KITS, అంబాల రోడ్, ముచ్చర్ల రోడ్ New Highwayకు 100 మీ॥ సమీపంలో గ॥ 166 & 333 & 466 గజాల ప్లాటు కలవు. సంప్ర॥ 9553255936. [W-1239991]

SERVICES

TRAINING & JOBS

■ శిక్షణ తీసుకుని స్కిల్స్ డెవలప్ చేసుకునే ఆసక్తి కలవారు ఇష్టముతో పని చేయగలవారు కావలెను. మీ బయోడేటా brg.hrteam@gmail.comకు మెయిల్ & 9393113929 కు వాట్సాప్ చేయగలరు. జీ: 10-25K. మ॥ లంచ్. పార్ట్/ఫుల్ టైం జాబ్స్. HNK, WGL, HYD. 7780473930 [WA-7540]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

BUSINESS OFFER

■ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/-ఇస్తాము. Contact Numbers: 9948000371, 9948000373 [H-1241126]

FINANCE

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239971]

OLD AGE HOME

■ హన్మకొండ వడ్డేపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. దయచేసి సంప్రదించగలరు. 9848444020, 9110551507. [W-1239906]

WANTED

■ Wanted Experience System Operator, Chowrasta Hanumakonda. Contact Cell No: 9550488999. [W-1237254]

■ హాపీల అసోసియేట్ హన్మకొండ, జనగామలలో పనిచేయుటకు Good Looking Telecaller (F), Marketing Ex.(M) కావలెను. సంప్ర॥ NIT దగ్గర, HNK, సూర్యపేట రోడ్, జనగామ. Cell: 7207946159. [W-1237308]

■ స్టార్ హోంకేర్ సర్వీసు 24 గం॥ పేషెంట్లు పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి 24 గం॥ డ్యూటి చేయడానికి, కేర్‌టేకర్, ఆయాలు, మగవారు / ఆడవారు కావలెను. 9100116067, 9059016067 [W-1239915]

■ Wanted Civil Engineer's Male Only + Marketing Executives for Sai Manikanta Reddy Mix Concrete Diploma/B.Tech, Civil with 2 years Experience Drop your Resume on Whatsapp No's 7670956668, 7330871166, 8555890439, 9849277408. [WA-14711]

■ డిజిటల్ ప్రింటర్స్ నందు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగము ఇవ్వబడును. హైదరాబాద్‌లో mim. Comp. నాలెడ్జ్ ఉండవలెను. పురుషులు మాత్రమే. Ph: 9989374446 [HA-98600]

■ భువనగిరిలో ఉన్న డాక్టర్స్ ఫ్యామిలీ వద్ద వంటపని, ఇంటిపని, ఇంట్లో చెట్లపని చేయుటకు భార్యాభర్తలు కావలెను. ఫ్యామిలీకి జీతం : 23,000/- + రూం ఫ్రీ. ఫోన్ : 96769 10322, 92469 69041 [V- 2691]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

■ అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మాదాపూర్, మియాపూర్, గండి మైసమ్మ ఏరియాలలో చేయుటకు కావలెను. వసతి+భోజనం ఉచితం, మంచి జీతం.ఫోన్: 9177155066, 7075906661 [H-796346]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901 [HA-14711]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.